నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4 PM
www.suryaa.com
బుధవారం
30-04-2025
పేజీలు: 02


## ఐపీఎల్‌లో నేడు



చెన్నై VS పంజాబ్
చెన్నై,
రాత్రి:7.30



స్టార్ స్పోర్ట్స్,
జియో హాట్
స్టార్‌లో..

## ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| టీమ్ | మ్యాచ్‌లు | విన్ | లాస్ | పాయింట్స్ |
|---|---|---|---|---|
| ఆర్సీబీ | 10 | 7 | 3 | 14 |
| ముంబై | 10 | 6 | 4 | 12 |
| గుజరాత్ | 9 | 6 | 3 | 12 |
| ఢిల్లీ | 10 | 6 | 4 | 12 |
| పంజాబ్ | 9 | 5 | 3 | 11 |
| లక్నో | 10 | 5 | 5 | 10 |
| కొల్‌కత్తా | 9 | 4 | 5 | 9 |
| రాజస్తాన్ | 10 | 3 | 7 | 6 |
| సన్‌రైజర్స్ | 9 | 3 | 6 | 6 |
| చెన్నై | 9 | 2 | 7 | 4 |



ఆరెంజ్ క్యాప్
456
ఐపీఎల్
అత్యధిక రన్స్



పర్పుల్ క్యాప్
18
ఐపీఎల్
అత్యధిక వికెట్స్



### విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో అపశ్రుతి

# ప్రమాదంలో 8 మంది మృతి

విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఇందులో భాగంగా... స్వామివారి నిజరూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులపై గోడ కూలింది. ఈ ఘటనలో ఎనిమిది మంది మృతి చెందగా.. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి! మృతులుల్లో నలుగురు పురుషులు, నలుగురు మహిళలు ఉన్నట్లు తెలుస్తోంది.అవును... సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ వర్షం కురిసింది. దీంతో... సింహగిరి బస్టాండ్ నుంచి పైకి వెళ్లే మార్గంలో రూ.300 టిక్కెట్ క్యూలైన్ పై సిమెంట్ గోడ కూలింది. అయితే.. గోడకు ఇరువైపులా ఇనుప ఫెన్సింగ్ ఉండటంతో పెను ప్రమాదమే తప్పిందని అంటున్నారు. గోడ కూలిన సమయంలో రాళ్లు నేరుగా భక్తులపై పడకుండా ఆ ఫెన్సింగ్ అడ్డుకున్నట్లు చెబుతున్నారు. ఆ ఫెన్సింగ్ లేకపోతే మరణాల సంఖ్య మరింత ఎక్కువగా ఉండేదని అంటున్నారు. ఈ ఘటన జరిగిన వెంటనే ఎన్.డీ.ఆర్.ఎఫ్. సిబ్బంది, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. మరోపక్క మృతులను విశాఖ కేజీహెచ్ కు తరలించారు. గాయపడినవారికి చికిత్స అందిస్తున్నారు.

సింహాచలం ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి

ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి నుంచి ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున అందజేయనున్నట్లు వెల్లడించారు.అక్షయ తృతీయ సందర్భంగా సింహాచలం వరాహా లక్ష్మీనరసింహస్వామి భక్తులకు నిజరూపంలో దర్శనం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా స్వామివారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేకువజామున ఒంటిగంటకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం ఆ తర్వాత స్వామివారి దేహంపై ఉన్న చందనాన్ని వెండి బొరిగెలతో అత్యంత సున్నితంగా వేరు చేసి.. నిజరూపంలోకి వచ్చిన స్వామికి విశేష అభిషేకాలు జరిపారు. స్వామి నిజరూపాన్ని దర్శించుకునేందుకు తరలివచ్చిన రాత్రి భక్తులు అక్కడే బస చేశారు. బుధవారం వేకువ జామున 2.30 గంటల ప్రాంతంలో నిద్రిస్తున్న భక్తులపై గోడ కూలింది. ఈ ఘటనలో ఎనిమిది మంది మృతి చెందారు.

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం!

సింహాచలంలో గోడ కూలి ఎనిమిది మంది భక్తులు మృతి చెందడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను కలిచివేసిందని అన్నారు. భారీ వర్షాలతో గోడ కూలడంతో ఈ ప్రమాదం జరిగిందని చెబుతూ.. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా... మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, గాయపడిన వారికి రూ.3 లక్షలు చొప్పున పరిహారం అందజేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

'ఎక్స్' వేదికగా స్పందించిన డిప్యూటీ సీఎం!


సింహాచలంలో గోడ కూలడం మూలంగా క్యూ లైన్ లో ఉన్న ఎనిమిది మంది భక్తులు మృతి చెందారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యానని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. చందనోత్సవ సమయాన ఈ దుర్ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమని చెబుతూ.. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.

తీవ్ర ఆవేదనకు గురి చేసింది - లోకేష్

సింహాచలం ఆలయం వద్ద జరిగిన దుర్ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని మంత్రి నారా లోకేష్ విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో గాయపడిన వారికి విశాఖ కేజీహెచ్ లో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు నారా లోకేష్.

భక్తుల మృతి బాధాకరం

సింహాచలం దుర్ఘటనపై బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మీనరసింహ స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న ఏడుగురు భక్తుల మృతి బాధాకరమన్నారు. స్వామివారి చందనోత్సవ సమయాన ఘటన జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలానే ఈ దుర్ఘటనపై రాష్ట్ర మంత్రులు నారాయణ, అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవి, సంధ్యారాణి, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.




## హోటల్‌లో అర్ధరాత్రి ఘోర అగ్ని ప్రమాదం..

# 14 మంది దుర్మరణం

పశ్చిమ బెంగాల్ కోల్‌కతాలోని ఓ హోటల్‌లో మంగళవారం అర్ధరాత్రి ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 14 మంది దుర్మరణం పాలయ్యారు. చాలా మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. కోల్‌కతా సీపీ మనోజ్ కుమార్ వర్మ మాట్లాడుతూ.. రాత్రి 8.15 గంటల ప్రాంతంలో రితురాజ్ హోటల్ ఆవరణలో మంటలు చెలరేగాయని సమాచారం అందిందని చెప్పారు. ఆ తర్వాత పలువురు భవనం కిటికీలు, ఇరుకైన గోడల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించారని.. నాలుగో అంతస్తు నుంచి పలువురు కిందకు దూకగా గాయపడ్డారని చెప్పారు. ప్రమాదంలో 14 మంది మృతదేహాలను వెలికి తీశామని.. చాలామందిని రక్షించినట్లు తెలిపారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చామని.. సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఘటనపై దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాన్ని సైతం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రమాదానికి కారణాలు తెలియవన్నారు. అయితే, షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు సంభవించాయని అనుమానిస్తున్నట్లు చెప్పారు.

## రింకూ సింగ్ చెంపపై కొట్టిన కుల్దీప్ యాదవ్



ఢిల్లీతో మంగళవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో కోల్‌కతా జట్టు 14 రన్స్ తేడాతో విజయం సాధించింది. అయితే మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానంలో ఓ సంఘటన చోటుచేసుకున్నది. ఢిల్లీ బౌలర్ కుల్దీప్ యాదవ్.. కోల్‌కతా బ్యాటర్ రింకూ సింగ్ చెంపపై కొట్టాడు. ఈ ఘటనకు చెందిన వీడియో వైరల్ అవుతున్నది. మ్యాచ్ ముగిసిన తర్వాత కుల్దీప్, రింకూలతో పాటు ఇతరు ప్లేయర్లు సరదాగా ముచ్చట్లాడుతున్నట్లు కనిపించారు. అయితే అకస్మాత్తుగా రింకూ చెంపై కుల్దీప్ కొట్టాడు. నవ్వుతూ మాట్లాడుకుంటున్న దశలో ఏం జరిగిందో రింకూకు అర్థం కాలేదు. మరోసారి కూడా కుల్దీప్ చేయి వెత్తడంతో.. రింకూ ఆ దశలో తన ఫేస్ రూపాన్ని మార్చేశాడు. నిజానికి అక్కడ ప్లేయర్లు ఏం మాట్లాడుకుంటున్నారో ఎవరికీ అర్థం కాలేదు. కానీ వీడియో ద్వారా మాత్రం కుల్దీప్ ఏదో ఆవేశంలో రింకూపై చేయి చేసుకున్నట్లు తెలిసింది. కుల్దీప్ వ్యవహారశైలిని కొందరు ఖండిస్తున్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలని నెటిజన్లు బీసీసీఐని కోరారు. మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతాకు బ్యాటర్లు సమిష్టిగా రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది. అంగ్‌క్రిష్ రఘువంశీ (32 బంతుల్లో 44, 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), రింకూ సింగ్ (25 బంతుల్లో 36, 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఆ తర్వాత ఛేదనకు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 190/9 పరిమితమైంది. డుప్లెసిస్(62), అక్షర్‌పటేల్(43)రాణించారు. నరైన్(3/29), వరుణ్ చక్రవర్తి(2/39)..ఢిల్లీ పతనాన్ని శాసించారు.

## తిరుమలలో శ్రీవారి సేవకులకు గుడ్‌న్యూస్

తిరుమలలో శ్రీవారి సేవ నాణ్యతను మెరుగుపరిచి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో టీటీడీ అధికారులు ముఖ్యమైన మార్పులు చేశారు. ఈ మార్పులు బుధవారం నుంచే అమలులోకి వచ్చాయి. టీటీడీ సభ్యులు కొందరు శ్రీ సత్యసాయి సేవా సంస్థ (పుట్టపర్తి), ఇషా ఫౌండేషన్ (కోయంబత్తూర్), ఆర్ట్ ఆఫ్ లివింగ్ (బెంగళూరు) వంటి ప్రఖ్యాత సంస్థలను సందర్శించి అక్కడ అందుతున్న సేవలను అధ్యయనం చేశారు. ఈ అధ్యయనం ఆధారంగా శ్రీవారి సేవలో కొన్ని ముఖ్యమైన మార్పులను టీటీడీ తీసుకొచ్చింది. గత రెండు సంవత్సరాలుగా పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు సేవలో పాల్గొంటుండగా ఇక 45 సంవత్సరాలు నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు శ్రీవారి సేవ కోసం తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. వీరిని 'గ్రూప్ లీడర్స్'గా పిలుస్తామని అధికారులు తెలిపారు.





## ఐశ్వర్య మీనన్ హాట్ లుక్స్

ఐశ్వర్య మీనన్ పలు భాషల్లో సినిమాలు చేసి తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. అమ్మడు సినిమాలతో పాటూ సోషల్ మీడియాలో ఫోటోలను షేర్ చేస్తూ కూడా ఫాలోయింగ్ ను పెంచుకుంటూ ఉంటుంది. తాజాగా ఐశ్వర్య వైట్ టాప్, షార్ట్ ప్యాంట్ లో అదిరిపోయే పోజులిచ్చి అందరినీ ఇట్టే ఎట్రాక్ట్ చేసింది. ఈ ఫోటోల్లో ఆమె స్టైల్, ఎక్స్‌ప్రెషన్స్ యూత్‌ను తెగ ఇంప్రెస్ చేశాయి. ఐశ్వర్య షేర్ చేసిన ఫోటోలకు వావ్ అంటూ తెగ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు.



## అజహరుద్దీన్ పేరు తొలగించొద్దు..

# హెచ్‌సీఏకు షాకిచ్చిన హైకోర్ట్

ఉప్పల్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలోని నార్త్ స్టాండ్స్‌కు ఉన్న అజహరుద్దీన్ పేరు తొలగించాలని గత వారం హెచ్‌సీఏ అంబుడ్స్‌మన్ జస్టిస్ ఈశ్వరయ్య ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే, తన పేరును తొలగించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో అజహరుద్దీన్ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అజహరుద్దీన్ పిటిషన్ పై మంగళవారం విచారణ చేపట్టి, తాము తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హెచ్‌సీఏను హైకోర్టు ఆదేశించింది. రెండు దశాబ్దాల పాటుగా క్రికెటర్‌గా భారత జట్టుకు సేవలందించానని, అంబుడ్స్‌మన్ ఆదేశాలపై స్టే ఇవ్వాలని ఆయన హైకోర్టును విజ్ఞప్తి చేయడంతో హైకోర్ట్ స్టే విధించింది.హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో స్టాండ్‌కు అజారుద్దీన్ పేరు పెట్టడం విరుద్ధ ప్రయోజనాలని గత వారం హెచ్‌సీఏ అంబుడ్స్‌మన్ జస్టిస్ వీ ఈశ్వరయ్య జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఉత్తర్వును సవాలు చేస్తూ అజారుద్దీన్ పిటిషన్ దాఖలు చేశాడు. దీంతో పైవిధంగా ఈ ఆదేశాలు వెలువడ్డాయి. అజారుద్దీన్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కె. రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఐదున్నర సంవత్సరాలకు పైగా అమలులో ఉందని, మాజీ క్రికెటర్ ప్రతిష్టను దెబ్బతీయడమే కాకుండా, జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛలను ఉల్లంఘిస్తుందని తెలిపాడు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## అమెరికాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది

అమెరికాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. భారత సంతతికి చెందిన టెక్ ఎంటర్‌ప్రెన్యూయర్ ఒకరు తన భార్యను, కుమారుడిని కాల్చి చంపి, అనంతరం తానూ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానిక పోలీసులు వెల్లడించారు. వాషింగ్టన్ రాష్ట్రంలోని న్యూకాజిల్ పట్టణంలోని వారి నివాసంలో ఏప్రిల్ 24వ తేదీన ఈ దారుణ సంఘటన జరిగినట్లు అధికారులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మృతులను హర్షవర్ధన ఎస్ కిక్కేరి (57), ఆయన భార్య శ్వేతా పాణ్యం (44), వారి 14 ఏళ్ల కుమారుడిగా గుర్తించారు. ఘటన జరిగిన సమయంలో వీరి మరో కుమారుడు ఇంట్లో లేకపోవడంతో ప్రాణాలు దక్కించుకున్నాడు. హర్షవర్ధన తొలుత భార్యను, కుమారుడిని కాల్చి చంపి, ఆ తర్వాత అదే తుపాకీతో తానూ కాల్చుకుని ప్రాణాలు తీసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.ఈ దారుణానికి పాల్పడటానికి స్పష్టమైన కారణాలు ఏమిటన్నది ఇంకా తెలియరాలేదని, దర్యాప్తు కొనసాగుతోందని కింగ్ కౌంటీ షెరీఫ్ కార్యాలయ అధికారులు పేర్కొన్నారు. ఆ కుటుంబం అందరితో స్నేహంగానే మెలిగేదని, అయితే తమ వ్యక్తిగత విషయాలను ఎక్కువగా ఇతరులతో పంచుకునేవారు కాదని పొరుగువారు చెప్పినట్లు స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి.



## హర్యానా, పంజాబ్ రాష్ట్రాల మధ్య నీటి పంపకాల వివాదం మరోసారి తీవ్రస్థాయికి చేరింది

హర్యానా, పంజాబ్ రాష్ట్రాల మధ్య నీటి పంపకాల వివాదం మరోసారి తీవ్రస్థాయికి చేరింది. తమ రాష్ట్రానికి తాగునీటిని విడుదల చేయాలని, లేదంటే భాక్రా డ్యామ్‌లోని అదనపు జలాలు పాకిస్థాన్ కు పోతాయని హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ పంజాబ్‌ను హెచ్చరించారు. వర్షాకాలంలో నీటిని నిల్వ చేసుకునేందుకు వీలుగా జూన్ లోపు భాక్రా జలాశయాన్ని ఖాళీ చేయాలని ఆయన నొక్కి చెప్పారు.q"జలాశయంలో నీటిని నిల్వ చేయడానికి స్థలం లేకపోతే, అదనపు నీరు హరి-కే-పట్టన్ మీదుగా పాకిస్థాన్ కు వెళ్తుంది. ఇది పంజాబ్‌కు గానీ, దేశానికి గానీ మంచిది కాదు" అని సైనీ అన్నారు. ఈ వివాదం కారణంగా ఢిల్లీ తాగునీటి సరఫరాపై పైనా ప్రభావం పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది తమకు రావాల్సిన పూర్తి వాటా నీరు అందలేదన్నారు. గత నెల భాక్రా బియాస్ మేనేజ్‌మెంట్ బోర్డ్ హర్యానాకు విడుదల చేసిన నీటిలో 500 క్యూసెక్కులు ఢిల్లీకి, 800 క్యూసెక్కులు రాజస్థాన్‌కు, 400 క్యూసెక్కులు పంజాబ్‌కే వెళ్లాయని, దీంతో హర్యానాకు వాస్తవంగా 6,800 క్యూసెక్కులు మాత్రమే అందాయని సైనీ వివరించారు. హర్యానా డిమాండ్ మేరకు నీటిని విడుదల చేయాలని బీజేపీ ప్రభుత్వం భాక్రా బియాస్ మేనేజ్ మెంట్ బోర్డు ద్వారా పంజాబ్‌పై ఒత్తిడి తెస్తోందని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఆరోపించారు. హర్యానా ఇప్పటికే మార్చి నెలలో కేటాయించిన నీటి వాటాలో 103 శాతం వినియోగించుకుందని ఆయన పేర్కొన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య సట్లెజ్-యమునా లింక్ కెనాల్ నిర్మాణంపై వివాదం ఏళ్లుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. పంజాబ్‌లో వరి సాగు ఏప్రిల్ మే నెలల్లో ఉండదని, ఈ సమయంలో విడుదల చేసే నీరు కేవలం తాగునీటి అవసరాలకేనని సైనీ చెప్పారు. అయితే, సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన నేపథ్యంలో, చినాబ్, జీలం వంటి నదుల జలాలను ఉత్తరాది రాష్ట్రాలకు మళ్లించాలని భగవంత్ మాన్ కేంద్రాన్ని కోరారు.

## కోల్‌కతాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది

కోల్‌కతాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. మంగళవారం రాత్రి నగరంలోని ఓ హోటల్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో ఒక మహిళ, ఇద్దరు పిల్లలతో సహా 15 మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఫాల్‌పట్టి మచ్చువా ప్రాంతానికి సమీపంలో ఉన్న రీతూరాజ్ హోటల్‌లో రాత్రి 8:15 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే అవి హోటల్ అంతటా వ్యాపించాయి. దట్టమైన పొగ కమ్ముకోవడంతో చాలామంది ఊపిరాడక ఇబ్బంది పడ్డారు.ప్రాణభయంతో కొందరు కిటికీ అద్దాలు పగలగొట్టి బయటపడే ప్రయత్నం చేయగా, మరికొందరు గదుల్లోనే చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఊపిరాడక పది మంది తమ గదుల్లోనే మరణించారు. తప్పించుకునే ప్రయత్నంలో మరో ముగ్గురు మెట్లపైనే కుప్పకూలిపోయారు.ప్రాణాలు కాపాడుకునేందుకు ఆరో అంతస్తు నుంచి దూకిన మరో వ్యక్తి కూడా దుర్మరణం పాలయ్యాడు. హోటల్ లో నుంచి 15 మృతదేహాలను వెలికితీసినట్లు కోల్‌కతా పోలీస్ కమీషనర్ మనోజ్ కుమార్ వర్మ తెలిపారు.



## నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న విప్

జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాజారాం గ్రామంలో బుధవారం జరుగుతున్న నల్ల పోచమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రభుత్వ విప్ కు ఆలయ పక్షాన ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో ఇటీవల వేయించిన బోరును ఆయన ప్రారంభించారు.

## బాసరలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

అక్షయ తృతీయ సందర్భంగా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. బంగారు లక్ష్మీగా దర్శనమిచ్చే అమ్మవారిని దర్శించేందుకు తెల్లవారుజాము నుంచి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, చిన్నారులకు అక్షరాభ్యాసాలు ఘనంగా జరిగాయి. ఈ పుణ్యక్షేత్రంలో భక్తులు ఆధ్యాత్మిక ఉత్సాహంతో పాల్గొన్నారు.

## గ్రూప్-1 నియామకాలపై TGPSC పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు

తెలంగాణలో గ్రూప్-1 నియామకాలను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలపై టీజీపీఎస్సీ అప్పీల్ చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరిపిన హైకోర్టు.. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వుల రద్దుకు నిరాకరించింది. దీనిపై సింగిల్ బెంచ్‌లో ఇవాళ మధ్యాహ్నం విచారణ ఉన్నందున తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది.




## జత్వానీ కేసులో కీలక మలుపు

ముంబై నటి జత్వానీకి సంబంధించిన కేసు విచారణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ సీఐడీ కీలక చర్యలు చేపట్టింది. ఈ కేసులో ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులు కాంతి రాణా తాతా, విశాల్ గున్నిలకు మరోసారి నోటీసులు జారీ చేసింది. మే 5వ తేదీన తమ ఎదుట విచారణకు హాజరు కావాలని ఆ నోటీసుల్లో స్పష్టంగా పేర్కొంది. గతంలో ఈ అధికారులిద్దరూ ఇచ్చిన వాంగ్మూలాలకు, ప్రస్తుత విచారణలో మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు వెల్లడించిన అంశాలకు మధ్య వైరుధ్యాలు కనిపించడమే తాజా నోటీసులకు కారణంగా తెలుస్తోంది.ఈ కేసుకు సంబంధించి సీఐడీ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులును విచారిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా, గతంలో కాంతి రాణా తాతా, విశాల్ గున్నిలు వెల్లడించిన కొన్ని అంశాలను ఆయన ఖండించినట్లు సమాచారం. ముఖ్యంగా, జత్వానీని ముంబై నుంచి తీసుకురావాలనే టాస్క్‌ను తనకు అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ హోదాలో ఆంజనేయులు అప్పగించారని గతంలో విశాల్ గున్ని సీఐడీకి తెలిపినట్లు వార్తలు వచ్చాయి. అయితే, తాను విశాల్ గున్నితో కేవలం నిఘా సంబంధిత విషయాలు మాత్రమే మాట్లాడి ఉంటానని... జత్వానీ విషయంపై విశాల్ గున్నితో కానీ, కాంతి రాణాతో కానీ తాను ఎలాంటి చర్చలు జరపలేదని పీఎస్ఆర్ ఆంజనేయులు తన విచారణలో స్పష్టం చేసినట్లు తెలిసింది.గతంలో కాంతి రాణా తాతా, విశాల్ గున్నిలను సీఐడీ అధికారులు ఇదే కేసులో ప్రశ్నించారు. తాజాగా పీఎస్ఆర్ ఆంజనేయులు ఇచ్చిన వాంగ్మూలంతో, ఈ ముగ్గురి కథనాల్లో పొంతన కుదరడం లేదని సీఐడీ అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు, గత వాంగ్మూలాల్లోని అంశాలపై మరింత స్పష్టత కోసం కాంతి రాణా, విశాల్ గున్నిలను మరోసారి ప్రశ్నించాలని సీఐడీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే వారికి మే 5న విచారణకు రావాలని నోటీసులు జారీ చేసింది.

## బైక్ చక్రంలో చున్నీ పడి వివాహిత మృతి

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో అనుకోని ప్రమాద సంఘటన జరిగింది .వివరాల్లోకి వెళ్ళితే.... తూర్పుగోదావరి జిల్లా కేసనకర్రుకు చెందిన కల్యాణపు రామదుర్గ (28)కు కోనసీమ జిల్లా పోలవరానికి చెందిన విన్నకోట మోహనకృష్ణతో 9 నెలల క్రితం వివాహమైంది.మోహనకృష్ణకు తాజాగా అచ్యుతాపురం సెజ్‌లో ఉద్యోగం రావడంతో అక్కడకు సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. రామదుర్గకు చెవి నొప్పిగా ఉండటంతో సోమవారం రాత్రి 7 గంటల సమయంలో భర్త ఆమెను తీసుకుని ఆసుపత్రికి బయలుదేరాడు. ఈ క్రమంలో హరిపాలెం వద్ద రామదుర్గ వేసుకున్న చున్నీ బైక్ వెనుక చక్రంలో పడి మెడకు బిగుసుకుంది. గమనించిన స్థానికులు మెడకు చుట్టుకున్న చున్నీని కత్తిరించి ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్టు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.





## జాన్వీ కపూర్ అందాల అరాచకం

రెగ్యులర్ ఫ్రెష్ అండ్ హాట్ లుక్స్ తో యూత్‌కి పిచ్చెక్కించే జాన్వీ కపూర్ తాజాగా మరిన్ని స్టన్నింగ్ లుక్స్ పోస్ట్ చేసింది. లేలేత అందాలు ఆరబోస్తూ కుర్రకారును కవ్వించింది. దీంతో జాన్వీ షేర్ చేసిన ఈ ఫొటోస్ క్షణాల్లో వైరల్ గా మారాయి.లేలేత గ్లామర్ డోస్ దట్టించడంలో ముందు వరుసలో ఉండే ఈ భామ.. ఎక్కడా తగ్గేదే లే అంటోంది. అందాల డోస్ పెంచేసి ఆమె షేర్ చేసిన లేటెస్ట్ ఫొటోస్ చూసి కుర్రకారు పిచ్చెక్కిపోతున్నారు. ఆమె అందాన్ని తెగ పొగిడేస్తూ రొమాంటిక్ కామెంట్స్ చేస్తున్నారు. దివంగత శ్రీదేవి కూతురిగా సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది జాన్వీ. స్టార్ కిడ్ అనే మార్క్ పెట్టుకొని బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అలరిస్తోంది. ప్రస్తుతం సినిమాల కంటే వెబ్ సిరీస్, కమర్షియల్ యాడ్స్, ప్రమోషన్స్ కోసమే తన టైమ్ స్పెండ్ చేస్తూ.. ఇండస్ట్రీలో ఫుల్ క్రేజీ సెలబ్రిటీగా మారింది జాన్వీకపూర్.మరోవైపు సామజిక మాధ్యమాల్లో ఎక్కడ చూసినా ఆమె ఫొటోలే దర్శనమిస్తున్నాయి. పొట్టి దుస్తులతో పార్టీలకు వెళ్లడం, జిమ్ సెంటర్ల నుంచి బయటకు వస్తూ కెమెరాకు చిక్కడం ఇవన్నీ జాన్వీకి కామన్. పైగా తన హాట్ నెస్ చూపిస్తూ ఇన్‌స్టాలో కొన్ని ఫొటోస్ కూడా షేర్ చేస్తుంటుంది జాన్వీకపూర్.

## సరికొత్త రీఛార్జ్ ప్లాన్ అందుబాటులోకి తీసుకొచ్చిన బీఎస్ఎన్ఎల్

బీఎస్ఎన్ఎల్ కస్టమర్లను ఆకట్టుకునేందుకు ఆకర్షణీయమైన ప్లాన్‌లను అందిస్తోంది. ప్రధానంగా రెండో సిమ్‌గా ఉపయోగించుకునే వారికి తక్కువ ధరతో వార్షిక రీఛార్జ్ ప్లాన్ ఉపయోగకరంగా ఉంటోంది. కేవలం రూ.127 నెలవారీ ఖర్చుతో ఏడాది పాటు అపరిమిత కాలింగ్, డేటా లభిస్తున్న ఈ అద్భుత ప్లాన్‌ను ఎంచుకోవచ్చు.గత కొద్ది రోజులుగా ప్రైవేటు టెలికాం సంస్థలు తమ రీఛార్జి ప్లాన్లను పెంచినప్పటి నుంచి బీఎస్ఎన్ఎల్ లక్షలాది మంది కస్టమర్లకు సరసమైన టెలికాం కంపెనీగా మారింది. ఈ ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బడ్జెట్ ఫ్రెండ్లీ ప్లాన్‌లను అందిస్తోంది. బీఎస్ఎన్ఎల్ తన కస్టమర్ల కోసం రెండు అద్భుతమైన వార్షిక ప్రీపెయిడ్ ప్లాన్లను ప్రవేశపెట్టింది. ఇందులో ఒకటి.. ఏడాదికి (365 రోజులు) ప్రీపెయిడ్ ప్లాన్ రూ.1,515లకు అందిస్తోంది. ఈ ప్లాన్‌లో వినియోగదారుడు ప్రతి రోజు 2 జీబీ హై స్పీడ్ డేటాను పొందడంతో పాటు అపరిమిత వాయిస్ కాలింగ్ సౌకర్యం, రోజుకు వంద ఎస్ఎంఎస్‌లను పొందుతారు. అయితే ఈ ప్లాన్‌లో ఎలాంటి ఓటీటీ సబ్ స్క్రిప్షన్ లేదు. కానీ ఈ ప్లాన్ వల్ల నెలవారీ ఖర్చు కేవలం రూ.126.25 మాత్రమే అవుతుంది.మరో ప్లాన్ విషయానికి వస్తే 336 రోజుల కాలానికి రూ.1,499 రీఛార్జి ప్లాన్ తీసుకువచ్చింది. ఈ ప్లాన్‌లో 24 జీబీ డేటా మాత్రమే అందిస్తోంది. ఈ ప్లాన్‌లో అపరిమిత కాలింగ్‌తో పాటు రోజుకు వంద ఉచిత ఎస్ఎంఎస్ సౌకర్యం కూడా ఉంది. ఈ ప్లాన్‌తో నెల వారీ ఖర్చు రూ.137లు మాత్రమే అవుతుంది.